# ఎన్నికల ప్రచారం

(గల్పిక)

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం మొదటి లోకసభ ఎన్నికలకు రాజు పక్షాన దిబ్బేశ్వర్లుం గారూ, రైతుపక్షాన దిబ్బనాయుడూ నిలబడ్డారు. వీళ్ళుగాక ఇరవై తొమ్మిది మంది సొంతాన నిలబడి డిపాజిట్లు పోగొట్టుకున్నారు. వాళ్ళు సోదిలోకి కూడా రారు.

కాని దిబ్బేశ్వర్లుంగారి ఎన్నికల ప్రచారం సువర్ణాక్షరాలతో లిఖించ దగినది. అది నల్లరాసిలో కూడా అచ్చు కాకపోవటం శోచనీయం. అప్పటికీ ఇప్పటికీ దిబ్బలో ఎన్నికల ప్రచారం ఆట్టే మారలేదు గనక దాని వివ రాలు కొంతమందికైనా ఆసక్తికరంగా ఉండొచ్చు.

దిబ్బేశ్వర్లుంగారి మీటింగుకు నూట అయిదుగురు వచ్చారు. అందులో ఎనభై తొమ్మిదిమంది వారి ఇలగమే. శ్రీవారు మైక్ ముందుకు తప్పతాగి వచ్చారని గొప్పగా చెప్పుకున్నారు. అదొక పెద్ద ఆకర్షణ అయింది.

"మహాజనులారా !" అని మొదలు పెట్టి వారు చాలా సేపు తమ గొప్పతనం చెప్పుకున్నారు. ఆ తరవాత అకస్మా త్తుగా ఆయనకు ఎన్నికల మాట గుర్తొచ్చింది.

"మీ వోటెవరి కిస్తారు ? రావణా సురుడి కిస్తారా ? కుంభకర్ణుడి కిస్తారా ? వాళ్ళు దుర్మార్గులు, నీచులు, రాక్షసులు! నీతీ జాతీ లేనివాళ్లు ! రాముడంటే ఎంత గొప్పవాడు ! ఆ రాముడి పెళ్ళాన్ని ఎత్తుకుపోయినవాణ్ణి ఎంత బుద్ధి తక్కువ్వాడనాలి ? వాణ్ణి పగల గోసినా పాపంలేదు ! కొరతేసినా తప్పులేదు ! ఊరికే చంపెయ్యటం కాదు, అలాటి వాణ్ణి కత్తికి కండలు కోసి, ఉప్పూ, కారమూ రాయాలి..."

శ్రీవారికి ఆవేశం ఎక్కువై, నోటంట నురుగులు వచ్చి, మూర్ఛ పోయారు. ఆయన మనుషులు ఆయన చేత సీసాలో ఏదో తాగించి, స్పృహ తెప్పించినాక ఆయన, "అందుచే తేవిటంటే మీరంతా నాకే వోటు చెయ్యండి !" అని వేదిక దిగిపోయారు.

వోట్లన్నీ ఆయనకే పడ్డాయి.

కొడవటిగంటి కుటుంబరావు